# లక్ష్మణుడు

*(సుమిత్రా దశరథుల ప్రథమ పుత్రుడు ఈ లక్ష్మణుడు. శతృఘ్నుడను మరొక తమ్ముడు కలడు. లక్ష్మణ శతృఘ్నులు కవల పిల్లలు. వీరు శ్రీరామచంద్రుని సోదరులు. లక్ష్మణునకు రాములన్న పంచప్రాణములు. రాముల సన్నిధే లక్ష్మణునకు పరమ పెన్నిధి అని ఆనందించెడివాడు. రామునికి నీడవలె నంటియుండెడివాడు. అన్యాయమును సహించెడివాడు కాడు ఈ లక్ష్మణుడు. తల్లీ, తండ్రి, భార్యాబిడ్డలకంటెను, రామచంద్రుడు అనిన లక్ష్మణునకు మహా ప్రధానము. రాములకు మించినది వేరొకటి లోకములో లేదని స్థిరవిశ్వాసముతో సర్వమునూ త్యజించి రాములతో అరణ్యమును అనుభవించిన పవిత్ర త్యాగి, సగుణ భక్తుడు ఈ లక్ష్మణుడు. రాముడే తండ్రి, సీతయే తల్లి అని భావించి సేవించెడివాడు. కడపటివరకు రాములతోనే జీవితమును గడపి, రామభక్తిలోనే నిరాడంబర జీవితమును గడిపిన ఆదర్శపురుషుడు లక్ష్మణుడు. స్త్రీలను కన్నెత్తి చూచెడివాడు కాదు. కడకు సీతను కూడా సరిగా చూచియెరుగడు. నిత్యప్రాతఃకాలమున నమస్కరించునప్పుడు పాదములు మాత్రమే దర్శించెడివాడు. ఋశ్యకూట పర్వతముపై చిక్కిన సీత నగల మూటలో సీత నగలు యేవియో గుర్తించుటకు రామచంద్రుడు లక్ష్మణుని ముందు పెట్ట, లక్ష్మణుడు కాలిఅందెలు తప్ప మిగిలినవేవియు తనకు తెలియవని తెలిపిన నిర్మలచిత్తుడు. ఇట్టి గుణవంతుడగుటచేతనే రాముల సన్నిధిని సంపాదించెను. ధనముకంటె, పదవికంటె, గుణమే దైవసన్నిధికి తగిన బలము అని లక్ష్మణుడు, తన జీవితమున నిరూపించెను.)*

**రాముని కుడిభుజం**

రామాయణంలో ప్రతివ్యక్తీ ఆదర్శప్రాయుడే. అందరూ ధర్మమూర్తులే. పవిత్ర చక్రవర్తులే. లక్ష్మణుని వాల్మీకి చాలా చక్కగా వర్ణిస్తాడు. లక్ష్మణుడు రామునికి రెండో హృదయమంటాడు. కంబరామాయణం లక్ష్మణుడు రామునికి రెండో గుణం అని వర్ణిస్తుంది. తులసీరామాయణం లక్ష్మణుడు రామునికి కుడిభుజంవంటి వాడంటుంది. రామలక్ష్మణులు బింబప్రతిబింబాలవలె అవినాభావ సంబంధంగలవారు. గుణగణాలలో పవిత్రతలో త్యాగంలో లక్ష్మణుడు తనకు తానే సాటి. తండ్రి ఆజ్ఞవలన రాముడు అరణ్యానికి పోవలసివచ్చింది. లక్ష్మణుని అరణ్యానికి పొమ్మని ఎవ్వరూ ఆజ్ఞాపించలేదు. అతడు తనకు తానే సర్వస్వం త్యాగం చేసి రాముణ్ణి అనుసరించాడు. రామ అయనమే తన ప్రధాన నయనంగా భావించాడు. అదీ రామ అయనం! రామ అయనంలో ప్రధానపాత్ర వహించినవాడు లక్ష్మణుడు. తల్లిని, రాజ్యాన్ని, సతిని సర్వస్వాన్ని త్యాగంచేసి రామతత్త్వమే గురు తత్త్వమని, రాముడే మిత్రుడు, రాముడే సోదరుడు, రాముడే ప్రాణం అని భావించి రాముని అనుసరించాడు. కన్న తల్లిదండ్రులను వదిలాడు. కట్టుకున్న భార్యనుకూడా వదిలాడు. తనయొక్క లోకసంబంధమైన భోగములను త్యజించాడు. రాముడే నాకు ప్రధానమనే లక్ష్యాన్ని పెట్టుకొని ప్రయాణం చేశాడు. ఈవిధముగా సీతారాములను అనుసరిస్తూ, వారికి కింకరుడుగా సేవలు సల్పుతూ తన జీవితమును ధన్యము గావించుకునే లక్ష్యమే పరమగమ్యమని భావిస్తూవచ్చాడు. రామునకు కుడిభుజంగా నిలచి అనేకావస్థలకు గురి అయ్యాడు. కష్టములను హృదయపూర్వకంగా స్వాగతం చేసుకున్నాడు. నవ్వుతూ, నవ్వుతూ కష్టములను అనుభవించుతూ వచ్చాడు. దైవాజ్ఞను, రామాజ్ఞను ఎంతో శ్రద్ధతో తూచా తప్పక అనుసరించాడు. ఏదైతే యేమి, రామాజ్ఞ, మంచి చెడ్డ పరమాత్మునికే తెలుసు అని కర్తవ్య దృష్టిచే తాను ఆజ్ఞను పరిపాలించాడు.

**రామార్పిత చిత్తుడు**

దైవికముగా జన్మముతోనే పవిత్రమైనటువంటి భావములను, ఇంద్రియనిగ్రహములను కలిగినవాడు లక్ష్మణుడు. అతడు రామార్పిత చిత్తుడు. ఆ సంగతి ఎట్లు తెలిసినదనగా, అతడు పుట్టిన రెండవరోజు నుండియే పాలు త్రాగక, నిద్రపోక, పోరుపెట్టి విరామము లేకుండా విలపిస్తూ ఉండేవాడు. కారణమేమియో తెలియక, సుమిత్ర దశరథాదులు ఏవేవో వైద్యములు చేయించారు. అనేకవిధములైన యంత్రములు, మంత్రములు, తంత్రములు చేయించి చూచారు. ఎన్ని చేయించినప్పటికీ, పిల్లవాడి రోదన యేమాత్రము తగ్గలేదు. అప్పుడు వారు గురువులైన వసిష్ఠులవారి దగ్గరికి వెళ్ళి, విషయమంతా వినిపించారు. వారు క్షణకాలము యోచించి, అంతర్దృష్టితో రోదన కారణము తెలుసుకొని, సుమిత్రను పిల్చి, 'అమ్మా! రేపటినుంచి నీవు పిల్లవానిని కౌసల్యా మందిరమునకు తీసుకొని పోయి, రామునియొక్క తొట్టియందుంచుము' అని ఆజ్ఞాపించాడు. ఆవిధముగనే, ఆమె పిల్లవానిని తీసుకొని కౌసల్య మందిరమునకు వెళ్ళి, అతనిని రాముడు పరుండియున్న తొట్టియందు రాముని ప్రక్కనే పరుండ పెట్టినది. లక్ష్మణుడు ఆక్షణము నుండియు రోదనము మాని, ఆనందముతో కాళ్లుచేతులాడిస్తూ హాయిగా ఉన్నాడు. అందరును చూచి ఆనందమును, ఆశ్చర్యమును కూడా పొందిరి. లక్ష్మణుని రోదనమునకు కారణము రామవియోగమేనని తెలుసుకొన్నారు. అట్టి సంయోగము జీవితపర్యంతము కావాలని కోరుకున్నాడు లక్ష్మణుడు.

**వనవాసం**

రామవియోగము ఎంతబాధాకరంగా ఉండినదో, రామునియొక్క సంయోగము అంత ఆనందకరంగా ఉండినది లక్ష్మణునకు. ఆనాటినుండియు రాముని, నీడవలె లక్ష్మణుడు అనుసరిస్తూ వచ్చాడు. రాముడు లేకుండా లక్ష్మణుడు భుజించేవాడు కాదు. రాముడు లేని సమయమున తాను నిద్రించేవాడు కాదు. రాముని ఒక్క క్షణమైనా విడిచి వుండేవాడు కాదు. ఎక్కడికి వెళ్ళినా రాముని వెంటనే ఒక నీడవలె అనుసరిస్తూ వచ్చాడు. అతనికి రామభక్తి మెండు. తన సర్వస్వమూ రాముడే అనే విశ్వాసమును అతడు భద్రపరచుకున్నాడు. కైకేయి, తన కుమారుడైన భరతునికి రాజ్యపట్టాభిషేకము జరుగవలెననీ, రాముడు నారవస్త్రములు ధరించి పదునాలుగు సంవత్సరములు అరణ్యవాసము చేయవలెననీ వరము కోరింది. ఆ వరమునందు లక్ష్మణునకు యేమాత్రముకూడను చోటులేదు. అయినా, అతడు రాముడరణ్యమునకు పోవు సమయమునందు తానుకూడను నారచీరలు కట్టి, జడలు ధరించి రామునివెంట వెళ్ళుటకు సిద్ధమయ్యాడు. ఆహారవిహారములందు మాత్రమే కాకుండా, తన నిత్య జీవితమందు కూడను రాములనే అనుసరిస్తూ వస్తున్నాడు లక్ష్మణుడు. పదునాలుగు సంవత్సరములు నిద్రాహారములు మాని, సీతారాముల యొక్క సేవలను ఆచరిస్తూ నిరంతరమూ వారు ఎట్టి ఆపదలకు గురికాకుండా కాపాడుతూ వచ్చాడు. నిజముగా ఆ పదునాలుగు సంవత్సరములు లక్ష్మణుడే లేకుండిన సీతారాములు జీవితములను ఎట్లు గడిపియుండెడివారో!

**నీ యిష్టమే నా యిష్టం**

అరణ్యమునకు వెళ్ళిన తరువాత రాముడు అలసిపోయి, 'లక్ష్మణా! ఒక పర్ణశాలను నిర్మించు' అన్నాడు. 'ఎక్కడ అన్నా?' అని అడిగాడు లక్ష్మణుడు. 'నీకిష్టం వచ్చిన చోట నిర్మించు' అన్నాడు రాముడు. ఆ మాటతో కూలిపోయాడు లక్ష్మణుడు. 'ఇంత కఠినమైన మాట నేను వినవలసి వచ్చె కదా! ఇది నా దురదృష్టము. ఇది నా కర్మఫలము' అని విచారిస్తూ కూర్చున్నాడు. రాముడు అతని దగ్గరకు వెళ్ళి, 'ఎందుకు నీవింత అపోహ పడుతున్నావు? నేను అనరాని మాటలు అనలేదే!' అని అడిగాడు. అప్పుడు చెప్పాడు లక్ష్మణుడు, 'నేను ఏనాడో నీకు శరణాగతుడనైనాను. కాని, నీవు మాత్రం నీయిష్టం వచ్చిన చోట పర్ణశాలను నిర్మించమన్నావు. ఇంతకంటె కఠినమైన మాట కావలెనా? నాకు ప్రత్యేకించి యిష్టము ఉంటున్నదా? అలా ఉంటే యింక శరణాగతికి అర్థమేమి

ఉంటుంది? కనుక, నాకు ఏ యిష్టమూ లేదు. నీ యిష్టమే నా యిష్టము' అన్నాడు. అప్పుడు రాముడు ఈ సత్యాన్ని గుర్తించి, 'లక్ష్మణా! నీవు బాధ పడకు. ఈ స్థానములో నీవు పర్ణశాలను నిర్మించు' అన్నాడు. అంత సూక్ష్మమైన బుద్ధిగలవాడు  లక్ష్మణుడు.

**లక్ష్మణుని శీలం**

లక్ష్మణుని శీలం ఎన్నోవిధాలుగా రామాయణము వర్ణిస్తూవచ్చింది. పదునాలుగు సంవత్సరములు అరణ్యములో వంటరిగా వుండినప్పటికి సీత ముఖము ఒక్క క్షణమైనా తాను చూచి ఎరుగడు. ప్రపంచమునకు లక్ష్మణునియొక్క పవిత్రతను ఆదర్శముగా నిరూపించే నిమిత్తమై రాములు కొన్ని పరీక్షలకు కూడను పూనుకున్నాడు. లక్ష్మణునియొక్క పవిత్రత నాకు తెలుసుగానీ లోకము ఎరుగదు. ఒకానొకసమయంలో రామ, లక్ష్మణ, సీతలు ముగ్వురూ ఒక వృక్షము క్రింద విశ్రాంతి తీసుకుంటున్నారు. లక్ష్మణునియొక్క పవిత్రత ప్రపంచమునకు చాటే నిమిత్తమై రాములు చిన్న యుక్తి పన్నాడు. 'లక్ష్మణా! నేను కొంత బయట ప్రదేశానికి పోవలసిఉంది. నువ్వు యిక్కడే ఉండి, ఇది చాలా దట్టమైన అడవి రాక్షసులమాయలు అనేకరకములుగా వుంటున్నాయి కనుక, నీవు యేమాత్రము రెప్పపాటు మాత్రం కూడను విస్మరించక సీతను మాత్రమే చూస్తూ ఉండు' అని చెప్పాడు. ఇది లక్ష్మణునికి పరీక్షగా తోచింది. సీత పాదములనే చూస్తున్నాడు. కొంతసేపు అయ్యేటప్పటికి ఆ వృక్షముపై ఒక పక్షి వచ్చి వాలి ఉంది. రాముడు పక్షి రూపము ధరించి వచ్చాడు. నేను సీతను సరైన రీతిగా కాపాడుతూ రావాలని ప్రతిజ్ఞ చేసుకున్నాడు తాను. చెట్టుపైనున్న పక్షి ఒక శ్లోకాన్ని ఉచ్చరించింది. 'అతి మధురమైన పండును చూచినప్పుడు, పరిమళమైన పుష్పమును మనము ధరించినప్పుడు, వంటరిగా ఒక యువతిని చూచినప్పుడు యువకుడు యేరీతిగా ఉండగలడు?' అనే ప్రశ్న వేసింది. లక్ష్మణుడు దానికి జవాబుగాచెబుతున్నాడు,' పతివ్రతయైన తల్లికి పుట్టిన యేమానవుడు కూడను దీనికి చలించడు' అని జవాబిచ్చాడు. తల్లియందో, తండ్రియందో కొంత దోషము ఉండినవాడే యిలాంటి అపవిత్రమైన భావాలకు గురౌతాడుగానీ యిరువురియందు శుద్ధమైన, పవిత్రమైన భావాలు ఉండినప్పుడు యేనాడు యిటువంటి అపవిత్రమైన భావములకు పాల్పడడు' అన్నాడు. మరొక ప్రశ్న వేసింది చిలుక. 'మదగజమువలె మనస్సు సంచరించే సమయమందు అనగా మంచి చెడ్డలను విస్మరించి కేవలము స్వేచ్ఛావిహారము సలిపే సందర్భములో ఈ యువకుడు తాను యేవిధమైన నిగ్రహము చేయగలడు?' అంది. 'మదగజమైనప్పటికి, స్వేచ్ఛావిహారము సల్పినప్పటికి జ్ఞానమనే అంకుశముచేత దానిని అరికట్ట గలడు. ఈ జ్ఞానమనే అంకుశము కల్గిన వానిని యే మదగజము యేమీ చేయలేద'న్నాడు. తక్షణమే చిలుక రామస్వరూపాన్ని ధరించింది. 'లక్ష్మణా! నీ నిమిత్తము కాదు. నీ సత్యము నాకు తెలుసు. కానీ లోకానికి వ్యక్తము గావించే నిమిత్తమై నేను యీరకంగా నిన్ను పరీక్షించాను' అన్నాడు.

**నూపురేత్వభిజానామి**

సీతాన్వేషణ సలుపుతూ వెళ్ళే సమయంలో కబంధుని చేతిలో యిరువురూ చిక్కుకున్నారు. అప్పుడు లక్ష్మణుడు చెబుతున్నాడు, 'అన్నా! నా విషయమై నీవు యేమాత్రము విచారించనక్కర లేదు. నన్ను ఈ కబంధునకు ఆహారముగా అప్పజెప్పి తమరు క్షేమంగా ఉండండి' అని ప్రార్థించాడు. సోదరుని నిమిత్తమై ప్రాణమునుకూడా త్యాగము చేయటానికి సంసిద్ధుడైనవాడు లక్ష్మణుడు. లక్ష్మణుని శీలం, గుణం లోకానికే ఆదర్శప్రాయం. సీతాన్వేషణ సలుపుతూ వెళ్ళుతుండగా దారిలో ఋష్యమూక పర్వంతంపై సుగ్రీవ హనుమంతులతో స్నేహం కలిగింది రామ లక్ష్మణులకు. అక్కడ సుగ్రీవుడు ఒక నగలమూట రాముని చేతికి అందించి ఎవరో ఒక స్త్రీ ఆకాశమార్గంలో పయనిస్తూ ఈ మూటను క్రింద జారవిడిచిందని చెప్పాడు. ఆ మూటను విప్పి చూచినప్పుడు రామునికి ఈ నగల సంగతి యేమీ తెలియదు. లక్ష్మణునికి చెప్పాడు, 'లక్ష్మణా!

ఇందులో సీత నగలేమైనా ఉన్నాయేమో చూడు'. 'నాహంజానామి కేయూరే' ఈ కంకణాలు సీతమ్మవి అవునోకాదో నాకు తెలియదు. 'నాహం జానామి కుండలే' ఈ కర్ణకుండలాలు కూడా సీతమ్మవి అవునోకాదో నాకు తెలియదు. 'నూపురే త్వభిజానామి' ఈ కాలి అందెలు మాత్రము సీతమ్మవే. నాకు తెలుసు. ఎందుకనగా 'నిత్యం పాదాభివందనాత్' ప్రతినిత్యం ఆమె పాదాలకు నమస్కారం చేసే సమయంలో ఈ పాదాల అందెలు నేను చూచేవాణ్ణి. సీతారాముల కళ్యాణం జరిగిన తరువాత పన్నెండు సంవత్సరాలు అయోధ్యలో ఉన్నారు. తదుపరి పదమూడు సంవత్సరాలు అరణ్యంలో వాసం చేశారు. ఈ ఇరవైఐదు సంవత్సరాలు సీతారాములతో ఉన్న లక్ష్మణుడు ఒక్కనాడైనా సీత ముఖం చూచినవాడు కాదు. పన్నెండు సంవత్సరాల అయోధ్య వాసం పద్నాల్గు సంవత్సరాల వనవాసం మొత్తం ఇరవైఆరు సంవత్సరాలు కావాలి. ఐతే పదినెలలు సీత లంకలో చిక్కుపడిపోయిందికదా! అందువల్ల లక్ష్మణుడు పదమూడు సంవత్సరాల వనవాసమని అంటాడు.

**రామాజ్ఞ శిరోధార్యం**

ఈవిధమైన ఉదాత్తగుణం గల పురుషుడు, స్త్రీలను మాతృమూర్తులుగా చూచేవాడు చరిత్రలో మనకు కనిపించడు. రామాజ్ఞను పురస్కరించుకొని నిండు గర్భవతిని సీతను మునిపల్లెలో విడచి రావటానికి బయలుదేరాడు. ఆ సమయంలో సీత ప్రశ్నిస్తుంది.'లక్ష్మణా! రాముడు లోకాపవాద భీతితో నన్ను అడవులకు పంపటంలో ధర్మమున్నది. ప్రజా పరిపాలనమే ప్రభుధర్మం. ప్రజలకు ఆదర్శవంతమైన జీవితాన్ని అందించటమే ప్రభువు కర్తవ్యం. స్వపర భేదం లేకుండా సర్వమూ త్యజించి ప్రజల క్షేమాన్ని చూడటమే ప్రభు నియమం. తన కీర్తియే నాకు ఆనందం. అతను నన్ను త్యజించినాడని నాకు దుఃఖం లేదు. రాముని కీర్తి చిరకాలం వర్ధిల్లాలి. కాని నీవు మరిదివి. ఈ అడవిలో నన్ను వదలి నీవు ఏరీతిగా వెనుకకు పోగలవు? నిండు గర్భవతినైన నన్ను ఒంటరిగా వదలిపోవటానికి నీ మనసెట్లా ఒప్పుతుంది? కొంత కాలం యిక్కడ ఉండి నాకు ధైర్యం చెప్పరాదా!' అన్నది. అప్పుడు లక్ష్మణుడు, 'తల్లీ! ఇంతకాలం నీ మోమును కూడా చూడలేదు. రామప్రభువు నీ చెంత లేనప్పుడు నేను నీ దగ్గర ఉండటం ఎంత అపచారం! నిర్గుణనిస్వార్థమైన నీ హృదయాన్ని అజ్ఞానులు బాధపెట్టారు. ఈ సమయంలో నేను నీ దగ్గర ఉండటం వలన నీకు అపకీర్తి తెచ్చినవాడినౌతాను. నా ప్రాణాలనైనా నీ పాదాలముందు అర్పితం గావిస్తాను కాని నీకు అపకీర్తి మాత్రం రానీయను. పైగా రామాజ్ఞ! రాముడే నా సర్వస్వం. అతని ఆజ్ఞను మీరితే నా ప్రాణమే ఉండదు. కనుక, తల్లీ! నన్ను క్షమించి పంపమని బాధపడుతూ నమస్కారం చేస్తాడు.

**సీతాపహరణం**

రాముడు బంగారు జింకనుతరుముకొనిపోతూ పర్ణశాలలో ఒంటరిగా నున్న సీతను కాపాడమని, ఎలాంటి స్థితిలోనూ సీతను వదలి పోకూడదని లక్ష్మణుని ఆజ్ఞాపించి వెళ్ళాడు రాముడు. కష్టాలు, దుఃఖాలు,నిందలు, నిష్ఠూరాలు ఎన్ని వచ్చినా సీతను వదలి రాకూడదని హెచ్చరించాడు. కాని, లక్ష్మణుడు జీవస్వరూపుడు. కనుక, అతనిలో కొంత బలహీనత బయలుదేరింది. 'హా సీతా! హా లక్ష్మణా!' అనే ఆర్తనాదం విని దానిని నిజంగా రాముని కంఠంగా భావించి వెంటనే, సీత, ' లక్ష్మణా! మీ అన్న కేదో ఆపద కలిగినట్లున్నది. నీవు పరుగెత్తి వెళ్ళి సహాయపడు' అని బలవంతం చేసింది. ఏదియేమైనా రామాజ్ఞను కఠినంగా పాలించదలిచాడు లక్ష్మణుడు. లక్ష్మణుడు, ' మా అన్నకెట్టి ఆపదా కలగదు. కలుగలేదు. ఆ మహా వీరునకు ఎట్టిసమయమునందుగానీ, ఇతరుల సహాయము అవసరముండదు. కనుక, నేను వెళ్ళనక్కరలేదు' అన్నాడు.అప్పుడు సీత అనేక కఠినోక్తులాడినది. అంతటితో ఊరకుండక, 'నీవు వెళ్ళకపోతే నేను ఆత్మహత్య చేసుకుంటాను, అగ్నిలోపడి ప్రాణత్యాగము చేసుకుంటాను' అంటూ అఘాయిత్యము చేసినది. కాని, సీత సూటిపోటు మాటలు హృదయానికి గుచ్చుకొని బాధించసాగాయి. సీత పరుషవాక్యాలు వినలేక రామాజ్ఞను మీరి సీతను వదలి అక్కడనుండి

కదిలాడు. తదుపరి సీతను రావణుడు తీసుకుపోవటం తెలిసి చాలా బాధపడ్డాడు. తాను దైవాజ్ఞను మీరటం వల్లనే కదా సీతకిన్ని కష్టాలు వచ్చాయి అని జీవితాంతం దుఃఖించాడు. తన జీవితంలో రామాజ్ఞను మీరిన మొట్టమొదటి ఘట్టమిది.

**ఇంద్రజిత్తువధ**

లక్ష్మణ ఇంద్రజిత్తుల ఘోరయుద్ధము జరిగిన మూడు దినములును, రాముల మనసు మహా ఆందోళన పొందినది. ఇంద్రజిత్తు ఓడిపోయిన తరువాత రాముడు లక్ష్మణుని చెంతకు వచ్చి, ఆలింగనము చేసుకొని, 'లక్ష్మణా! ఈనాడే నేను సీతను చూచినంత ఆనందమును అనుభవించాను!' అన్నాడు. రామరావణ యుద్ధమందు, ఇంద్రజిత్తు లక్ష్మణుల యుద్ధము ప్రధాన ఘట్టము. రావణునైననూ సులభముగా వధించవచ్చునుగానీ, ఇంద్రజిత్తును వధించటం చాలా కష్టము. కనుక, అట్టి కఠినమైనటువంటి చర్యకు లక్ష్మణుడు పూనుకొని, దానిని పూర్తికావించినాడనేటువంటి ఆనందముచేత, రాముడు తన సోదరుని చూచి, చాలా ఆనందపడుతూ వచ్చాడు. లక్ష్మణునివంటి సోదరుడు చిక్కటము మహాకష్టమని వర్ణిస్తూ వచ్చాడు విభీషణాదుల దగ్గర. 'నేను ఈ మహాకార్యమంతయూ లక్ష్మణుని సహాయముతో చేయగలిగితినిగానీ, లక్ష్మణుడే లేకుండిన ఈ కార్యక్రమమును సాధింపకలిగెడి వాడను కాను' అని తాను సుగ్రీవాదుల దగ్గర చెప్పుతూ వచ్చాడు.

**పెద్దపరీక్ష**

కడకు పెద్దపరీక్ష, రామాజ్ఞను మీరవలసిన మరొక సంఘటన. కాలస్వరూపుడైన రుద్రుడు స్వస్థానమునకు తిరిగి చేరవలసిన ముహూర్తమాసన్నమైనదని, రామునికి తెలుపుటకు వచ్చినాడు. అప్పుడు రాముడు లక్ష్మణుని పిలచి, 'ద్వారము దగ్గరనే ఉండుము. ఎవరినీ రానీయకుము. ఎవరినీ లోనికి విడువ వలదు' అని ఆజ్ఞాపించాడు. దురదృష్టవశాత్తు, అదే సమయానికి, దూర్వాసమహర్షి ఆగమించి వాకిలి తెరవమన్నాడు. లక్ష్మణుడు అతనిని గట్టిగా నిరోధించి, కాళ్లమీద పడి చాలా ప్రాధేయపడి ఆగమని ప్రార్థించాడు. దూర్వాసుని కోపమంటే సామాన్యమా! ఆయన శాపమునకై సిద్ధమైనాడు. 'నిన్ను, ఈ అయోధ్యలోని సమస్త ప్రజానీకమును భస్మము చేస్తాను' అని బెదిరించాడు. ఉత్తమ చిత్తము కలిగిన లక్ష్మణుడు, 'రామునిద్వారా నేను భస్మమైనా మంచిదే, నాద్వారా అయోధ్యా ప్రజలు భస్మము కాకూడదు' అని నిశ్చయించి వాకిలి తెరచి మహర్షికి ప్రవేశమిచ్చాడు. రామాజ్ఞను మీరి, ఆదిశేషుడైన లక్ష్మణుడు తన స్వస్థానమును ముందుగనే చేరినాడు.